క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



నర్మెట: పశువులకు కాలానుగుణంగా వచ్చే వ్యాధుల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి(డీవీఏహెచ్‌ఓ) డాక్టర్ వై.రాధాకిషన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన పశువైద్యశిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన సిబ్బందికి, రైతులకు పలు సూచనలు చేశారు. గాలికుంటు వ్యాధి కారణంగా పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గడంతోపాటు కాడెద్దులు తీవ్ర అస్వస్థతకు గురివుతాయని, చూడి పశువుల్లో గర్భకోశ వ్యాధులతో రక్త స్రావం జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా 164 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ వై.నర్సయ్య, మండల వైద్యాధికారి నేహా పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు: మండల పరిధి మల్కాపూర్ గ్రామంలో బుధవారం మండల పశువైద్యాధికారి మూడిక అనేష్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకిషన్ ప్రారంభించారు. ఏడీ నర్సయ్య, సారంగపాణి, ఫయాజ్, భిక్షపతి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల తనిఖీ



పాలకుర్తి టౌన్/స్టేషన్‌ఘన్‌పూర్: పాలకుర్తి మండల కేంద్రంలోని విద్యుత్‌సబ్‌స్టేషన్, స్టేషన్‌ఘన్‌పూర్ సబ్‌స్టేషన్‌ను డీఈ రాంబాబు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు అందించారు. భద్రత గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జ్ ఏడీ రణదీర్, ఏఈలు సత్తయ్య, రాములు, శివకుమార్ సబ్ ఇంజనీరు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

జనగామ: జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంట విజయదుర్గామాత జాతరను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు అన్నదానం చేపట్టారు. పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మేడ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

సత్కారం

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికై న బనుక శివరాజ్ యాదవ్‌ను బుధవారం లంబాడీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు నవీన్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని నమ్ముకుని కష్టపడ్డ వారికి పదవులు వస్తాయన్న దానికి నిదర్శనం శివరాజ్ అన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ర్యాలీ

స్టేషన్‌ఘన్‌పూర్: గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎండీ.యూనుస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల విద్యార్థులతో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. విద్యాజ్యోతి కళాశాల ప్రిన్సిపాల్ థామస్‌కిరణ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్నరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



కొడకండ్ల: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో నిర్వహించే పనులకు సంబంధించిన వివరాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలో ఉపాధిహామీలో చేపట్టిన పనులను పరిశీలించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల్లో నేషనల్ లెవల్ మానిటరింగ్ కేంద్ర బృందం గిర్నితండా, పెద్ద బాయితండా, బోడోనికుంట తండా, రామేశ్వరం, రేగుల గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనులను పరిశీలించడం జరుగుతుందని, ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, ఎంపీఓ ఇందిర, ఏపీఓ కుమారస్వామి, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బాబోయ్ కోతులు..!

- వీధుల్లో, ఇళ్లపై గుంపులుగా స్వైరవిహారం
- పంటలను నాశనం చేస్తున్న వానరాలు



రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్‌లో ఇంటిపై కోతుల గుంపు



బచ్చన్నపేటలో కోతుల గుంపు



చిల్పూరు గుట్టవద్ద..

రఘునాథపల్లి/బచ్చన్నపేట/చిల్పూరు: జిల్లాలోని పలు గ్రామాల్లో కోతుల బెడద తీవ్రమైంది. గుంపులు, గుంపులుగా వీధుల్లో, ఇళ్లపై స్వైరవిహారం చేస్తున్నాయి. ఇళ్ల పైకప్పుల పైనుంచి దూకుతూ పెంకుటిళ్లను ధ్వంసం చేస్తున్నాయి. వీధుల్లో వందలాది కోతులు సంచరిస్తుండటంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే భయకంపితులవుతున్నారు. వీధుల్లోకి వెళ్తే చేతిలో కర్ర ఉండాల్సిందేనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు చేసిన పంటలను సైతం నాశనం చేశాయని రైతులు వాపోతున్నారు. గ్రామం నుంచి కోతులను వెళ్లగొట్టాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి కోతుల బెడద నుంచి తమను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



నర్మెట: సిబ్బందితో మాట్లాడుతున్న పింకేష్‌కుమార్

నర్మెట: విధుల్లో నిర్లక్ష్యంతగదని, వైద్యసిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఆయన పరిసరాలను, ఆస్పత్రి గదులను పరిశీలించిన అనంతరం సిబ్బందిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎం అండ్ హెచ్‌ఓ డి. రవిందర్, ఎంపీడీఓ బి.అరవింద్ చౌదరి, వైద్యాధికారి రవళి స్టెల్లా, సునిత, అనిత, వేణు, అనిల్, శ్రీను, భాగ్య, శ్రీలత, కుమార స్వామి, శివ ప్రవీణ్, ఐలయ్య లాలు, కార్యదర్శి కందకట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ సందర్శన

తరిగొప్పుల: మండలంలోని బొంతగట్టునాగారంలోని అంగన్‌వాడీ కేంద్రాలను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ కనెక్షన్, తాగునీటి తదితర మౌలిక వసతుల ఏర్పాటు కావాల్సిన పాలనపరమైన ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి,డీఈ శ్రీనివాస్, ఏఈ ప్రదీప్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ, సీడీపీఓ రమాదేవి తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



కిరాణాషాపులో తనిఖీ చేస్తున్న ఏసీపీ, సీఐ

చిల్పూరు: షాపులు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ సూచించారు. మండలంలోని చిన్నపెండ్యాలలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించి సరైన పత్రాలు లేని నాలుగు వాహనాలను సీజ్ చేయడంతో పాటు ఏడుగురు వాహనదారులకు రూ.1,750 జరిమానా విధించారు. అదేవిధంగా గ్రామంలోని పలు షాపులను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా మద్యం, గుట్కాలు అమ్ముతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి రూ.7,500మద్యం, రూ.4,700 విలువైన అంబర్‌లు, గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిల్పూరు ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



లింగాలఘణపురం: మాట్లాడుతున్న డీపీఓ స్వరూప

లింగాలఘణపురం: గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం వాటర్‌మెన్ల చేతుల్లో ఉంటుంది.. నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ స్వరూప అన్నారు. బుధవారం బండ్లగూడెం రైతువేదికలో మండల పరిధి వాటర్‌మెన్లకు మిషన్ భగీరథ ఆధ్వర్యాన శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో తీసుకోవాల్సిన మెలకువలను శిక్షణలో నేర్చుకోవాలని సూచించారు. ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఎంపీఓ రఘురామకృష్ణ, ఏఈ రోహిణి ఉన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్‌మెన్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కృష్ణయ్య పాల్గొన్నారు. తాగు నీటికి ఉపయోగించే చేతిపంపుల మరమ్మతులపై పూర్తి స్థాయిలో అవగాన కలిగి ఉండాలని సూచించారు. ఈఈ శ్రీకాంత్, డీఈ సంధ్య, ఎంపీడీఓ రాములు, ఏఈ నాగుల ప్రశాంతి, ఎంపీఓ రవీందర్ పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించాలి

దేవరుప్పుల: ప్రజారోగ్య పరిరక్షణకు దోహదపడే సురక్షిత తాగునీటిని అందించేందుకు సుశిక్షితులుగా ఎదుగాలని ఎంపీడీఓ కె లక్ష్మీనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామ తాగునీటి సహాయకులకు ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ టి సురేష్‌కుమార్, ఏఈ మానస, ట్రెయినర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు భద్రత కల్పించాలి



బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో 174 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో గుడిసెలను వేసుకున్న వారికి ప్రభుత్వం భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నర్సింహులు, ఎల్లయ్య, అశోక్, బాల్‌నారాయణ, శోభ, మమత, లలిత, ఎల్లమ్మ, పుష్ప, నర్సింహులు పాల్గొన్నారు.

ప్రజాపాలన పేరుతో ద్రోహం

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



విలేకరులతో మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన అంటూ ప్రజల ముందుకు వచ్చి ప్రజాద్రోహిగా వ్యవహరిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. డివిజన్‌కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నాడో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. గూటిలో రాయి తీయలేనివాడు ఏట్లో రాయి తీస్తానన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం తీరు ఉందని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు అద్దె చెల్లించలేని వారు నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి నిరోధకుడు కడియం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి అభివృద్ధి నిరోధకుడని, 15 సంవత్సరాలు కేబినెట్ మంత్రిగా పనిచేసి నియోజకవర్గానికి చేసిందేమి లేదన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలను మరోసారి దగా చేసేందుకు కడియం చూస్తున్నాడని, నియోజకవర్గానికి టెక్స్‌టైల్ పార్కు రాకుండా, లింగంపల్లి రిజర్వాయర్ రాకుండా చేసిన ద్రోహి కడియం అని విమర్శించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు మారపాక రవి, చాడ సరిత, నాయకులు ఆకుల కుమార్, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, చల్లా చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



చిల్పూరు: విద్యుత్ సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ట్రాన్స్‌కో డీఈ రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు బదిలీ కాగా బుధవారం సబ్‌స్టేషన్ ఆవరణలో నూతన సిబ్బంది ఏఈ లక్ష్మీనారాయణకు స్వాగతం పలికి, బదిలీపై వెళ్తున్న వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎల్‌ఎం. ఎల్‌ఐలు ఐలేష్, సురేందర్ రెడ్డి, రాంమూర్తి, మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మధు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో హోంగార్డు మృతి



గౌస్‌పాషా(ఫైల్)

కొడకండ్ల: కొడకండ్ల పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ గౌస్‌పాషా(48) గుండెపోటుతో బుధవారం ఉదయం మృతి చెందాడు. మంగళవారం విధులు ముగించుకొని మండలకేంద్రంలోని తన ఇంటికి చేరుకున్నాడు. తెల్లవారుజామున ఆకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. అందరిని ఆప్యాయంగా పలుకరించే గౌస్‌పాషా ఆకస్మిక మృతి వార్త మండల వ్యాప్తంగా విషాదాన్ని నింపింది. విషయం తెలిసిన వెంటనే పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, స్థానిక ఎస్సై చింత రాజులతో పాటు పోలీస్ సిబ్బంది, హోంగార్డులు గౌస్‌పాషా నివాసానికి వచ్చి నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. అలాగే బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాము, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్‌లతో పాటు బంధు, మిత్రులు, నాయకులు నివాళులర్పించి కన్నీటి పర్యంతమ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి..

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ ఎండీ అన్వర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అన్వర్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఈనెల 10వ తేదీన కిందపడి స్పృహ కోల్పోయాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై రామ్‌చరణ్ బుధవారం తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె..

పాలకుర్తి : మండలంలోని విస్నూరు గ్రామానికి చెందిన రైతు వెన్నమనేని వివేకానందరావుకు చెందిన పాడిగెదే బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రైతు వివేకానందరావు వ్యవసాయ బావి వద్ద పాడి గేదే మేతకు వెళ్లగా సమీపంలో ఉన్న ట్రాన్స్‌పార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు చెప్పారు. మృతి చెందిన పాడిగేదే విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు.

వాహనాల దొంగ అరెస్ట్



కొడకండ్ల: ద్విచక్ర వాహనాల చోరీ దొంగను బుధవారం రిమాండ్‌కు పంపినట్లు పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలానికి చెందిన దొండపాటి చందు అలియాస్ గంగరాజు ఈ నెల 12న కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామంలో గ్లామర్ బైక్‌ని, ఆరునెలల క్రితం దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో స్ప్లెండర్ బైకిని చోరీ చేయడం జరిగిందని, తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని స్థానిక ఎస్సై చింత రాజు పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య కాషాయీకరణను వ్యతిరేకించాలి

పాలకుర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్య కాషాయీకరణను మేధావులు, విద్యార్థులు వ్యతిరేకించాలని విద్యా పరిరక్షణ కమిటీ మండల బాధ్యుడు చిదురాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఈ నెల20న జనగామలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవతం చేయాలని బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవన్‌లో ఎంఈఓ పోతుగంటి నర్సయ్యతో కలిసి విద్యాపరిక్షణ సమతి కరపత్రాన్ని అవిష్కరించారు.

నియామకం

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన ఏడునూరి వీరయ్యను బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ అడ్వైజర్‌గా నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ నియోజకవర్గ అడ్వైజర్‌గా నియమించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో పార్టీ పటిష్టత కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

జఫర్‌గఢ్: పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను తక్షణమే విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు మండలంలోని తమ్మడపల్లి (జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. నాయకులు సీతారామయ్య, సురేశ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

బచ్చన్నపేట: ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గోపాల్‌నగర్‌లో గ్రామమహా సభల సందర్భంగా జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి వెంకటేష్, నాయకులు నర్సింహులు, ఎల్లయ్య, అశోక్ పాల్గొన్నారు.

నివాళి

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు మోదుగు శ్రీను తల్లి రాజమణి (58) అనారోగ్యంతో మరణించింది. సమాచారం తెలుసుకున్న మండల పాత్రికేయులు బుధవారం వెల్ది గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాతృవియోగం పొందిన శ్రీనును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆర్థికసాయం అందజేశారు.

విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలి



తరిగొప్పుల: నియామకపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులతో ఎంఈఓ జానకి

కొడకండ్ల: విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నూతన ఉపాధ్యాయులంతా అంకితభావంతో పనిచేయాలని ఎంఈఓ గ్రేస్‌కేజీయారాణి కోరారు. బుధవారం నియామకమైన నూతన ఉపాధ్యాయులు ఎంఆర్సీలో ఎంఈఓకు రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలానికి 24 మంది ఎస్జీటీలు నియామకమై రిపోర్ట్ చేశారని, 11 మంది స్కూల్ అసిస్టెంట్లకు గాను 10 మంది రిపోర్ట్ చేశారని, ఒక స్కూల్ అసిస్టెంట్, ఒక ఎల్‌పీ రిపోర్ట్ చేయలేదన్నారు.

ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించాలి

తరిగొప్పుల: ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి, వృత్తిపై నిబద్ధతతో పనిచేయాలని మండల విద్యాశాఖ అధికారి నెల్లుట్ల జానకి అన్నారు. డీఎస్సీ-2024 ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులతో పాటు, సర్వీసులో ఉండి జూన్‌లో బదిలీ అయి నేటి వరకు నియామక ఉత్తర్వులు పొందని వారికి బుధవారం ఉత్తర్వులను కాంప్లెక్స్ హెచ్‌ఎం బానోత్ రవీందర్‌తో కలిసి ఆమె అందజేశారు. సీఆర్పీ మహాలక్ష్మి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు లక్ష్మీనారాయణ, కొయ్యడ శ్రీరాములు, అమర్‌నాథ్, బత్తుల నరేందర్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

లింగాలఘణపురం: మండలంలో 2024 డీఎస్సీలో నూతనంగా ఎంపికైన 9 మంది ఉపాధ్యాయుల్లో బుధవారం ఎనమిది మంది ఎంఈఓ విష్ణుమూర్తి సమక్షంలో మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో రిపోర్ట్ చేసి ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. కొత్తపల్లి, నాగారం, సిరిపురం, గుమ్మడవెల్లి, నెల్లుట్ల, ఆర్టీసీ కాలనీల్లో 8 మంది విధుల్లో చేరగా ఎంఈఓ విష్ణుమూర్తి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

జఫర్‌గఢ్: కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎండీ పర్వేజ్ అన్నారు. నూతనంగా ఎంపికైన 9 మంది ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేసి విధుల్లో చేరారు.

సన్మానం

బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం నూతనంగా జాయిన్ అయిన టీచర్ బండకింది స్వప్నను పలువురు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమం పాఠశాల హెచ్‌ఎం రాములు. నాయకులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లింగాలఘణపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం, అదనపు కలెక్టర్

లింగాలఘణపురం: రాబోయే రోజుల్లో ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. అంతేకాకుండా గురుకులాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కూడా సన్నబియ్యంతోనే పెట్టనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం వనపర్తిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దని, రూ.2లక్షలపైన ఉన్న రుణాల చెల్లింపుకు ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందిస్తున్నదని చెప్పారు. ప్రతిపక్షాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని మాట్లాడాలని.. అడ్డగోలుగా విమర్శలు చేయకూడదని హితవు చెప్పారు. సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, డైరెక్టర్ శ్రీలతారెడ్డి, డీఆర్‌డీఓ వసంత, డీఏఓ రామారావు నాయక్, డీసీఓ సరస్వతి, డీపీఎం వరలక్ష్మి, ఏపీఎం శంకరయ్య, ఏకేపీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

రఘునాథపల్లి: రైతులు తమ వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సూచించారు. బుధవారం మండలంలోని గోవర్దనగిరిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలో 22 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ గ్రేడ్ వరి క్వింటా రూ.2,320, కామన్ గ్రేడ్‌కు రూ. 2,300, సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్‌ను ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ వసంత, సివిల్ సప్లయ్ డీఎం హథీరాం, డీసీఎస్‌ఓ సరస్వతి, డీపీఎం రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ మోహిన్ ముస్తాబ, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఏపీఎం సారయ్య, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, సీసీలు రీనావతి, సంపత్, భాగ్యలక్ష్మి, ఉమ, ఏఈఓ వినోద్, వీఓఏ రమ తదితరులు పాల్గొన్నారు.

శివునిపల్లిలో..

స్టేషన్‌ఘన్‌పూర్: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. మండలంలోని శివునిపల్లిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సెంటర్ నిర్వాహకులు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, డీఎస్‌ఓ సరస్వతి, డీఆర్‌డీఏ పీడీ వసంత, డీపీఎం సమ్మక్క, ఏపీఎం కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, ఏఓ చంద్రన్‌కుమార్, ఆర్‌ఐ రవీందర్, వీఓఏ సరిత, బుక్ కీపర్ అనిత, కొనుగోలు కేంద్రం అధ్యక్షురాలు సంధ్య, సీసీలు రజిని, యాదగిరి, నాయకులు, రైతులు కొంతం శ్రీను, మాచర్ల కుమారస్వామి, నీల రాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా ఇందిరమ్మ కమిటీలను ఎన్నుకోవాలి



దేవరుప్పుల: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొడకండ్ల/పాలకుర్తిటౌన్/దేవరుప్పుల: ఇందిరమ్మ కమిటీలను గ్రామసభలు నిర్వహించి ఎంపిక చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాల అమలు కోసం ఏర్పటు చేసే గ్రామ స్థాయి ఇందిరమ్మ కమీటీలు పారదర్శకంగా ఉండాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండలాల అధ్యక్షులు సిందె రామోజీ, పసునూరి నవీన్, తీగల దయాకర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

బీటీగా మారనున్న మట్టిరోడ్లు

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం మట్టి రోడ్లకు మహర్థశ కల్పించిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలంలోని బండనాగారం-కట్కూర్, కేసిరెడ్డిపల్లి-గోపరాజుపల్లి వరకు ఉన్న మట్టి రోడ్లకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవ తీసుకొని వాటి స్థానంలో బీటీ రోడ్లను మంజూరు చేయించారన్నారు. ఈ రోడ్ల నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నారని తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బచ్చన్నపేట: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ఇళ్లు లేని నిరుపేదలకు పక్కా గృహాలు త్వరలో ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ గంగాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉమ్మెంతల భద్రయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో నూతన ఇందిరమ్మ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులుగా ఎడ్ల సత్తిరెడ్డి, ఇండ్ల రాములు, బందారం చిరంజీవి, జ్యోతి అనిత, బందారం నర్సమ్మలను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో జ్యోతి ఉమాపతి, మమత, కలమ్మ, సుదర్శన్, రాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తికి చెందిన రిటైర్డ్ వీడీఓ, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి తాత వంచ రంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్‌చందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్ తదితరులు ఉన్నారు.

తాటికొండలో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన ముక్కముల రాజు, నారదాసు ఐలయ్య ఇటీవల మృతిచెందగా మృతుల కుటుంబాలను మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

ఏకపక్షంగా కమిటీలు సరికాదు

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో కాంగ్రెస్‌ని నమ్ముకుని పనిచేస్తున్నవారిని కాదని ఇటీవల పార్టీలో చేరిన వారితో కమిటీలు ఏర్పాటు చేయడం సరికాదని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి సదయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో రడపాక రాజ్‌కుమార్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎండీ ముక్తార్‌అలీ, యాదగిరి, మల్లయ్య, లచ్చిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

దేవరుప్పుల: మండలంలోని కడవెండిలో ఇటీవల అకాల మృతి చెందిన బెజుగం నర్సింహ కుటుంబానికి జైభీమ్ యువసేన ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో జై భీమ్ యువసేన నాయకులు శ్రీకాంత్ చింటూ సందీప్ ప్రదీప్ సురేష్ బన్నీ సాగర్ సతీష్ హరీష్ రామ్ సందీప్ విజయ్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.